

డెంగీతో యువకుడి మృతి!

- ఆచంటలో ఎక్కడ చూసినా జ్వరాలే
- పడకేసిన పారిశుధ్య పనులు

ఆచంట, జనవరి 27 : జ్వరాలతో ఆచంట పడకేసింది. చాలా మంది వైరల్ ఫీవర్, డెంగీతో బాధపడుతూ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఆచంట శివారు రామాలయం, కుక్కలకోటి వీధి సమీపంలో సజ్జా శ్రీకాంత్ (29) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జ్వరం రావడంతో ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందాడు. తగ్గకపోవడంతో పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. అయినా తగ్గకపోవడంతో వారం క్రితం రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడి వైద్యులు శ్రీకాంత్‌కు డెంగీ అని నిర్ధారించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాంత్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలే శ్రీకాంత్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. తన కుమారుడు డెంగీతో మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడం, మురుగు బోదెలు సరిగా శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగి జ్వరాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. డెంగీ లక్షణాలున్నట్టు అనుమానం కలిగితే వారిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్నట్టు చెబుతున్నారు. గ్రామంలో శానిటేషన్ పనులు చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి చెప్పారు. మురుగు బోదెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామన్నారు.



ఆచంటలో పూడుకుపోయిన మురుగుబోదె

సర్వ్‌ర్ డౌన్

రెండు గంటలపాటు నిలిచిన రిజిస్ట్రేషన్‌లు

ఆచంట, జనవరి 27 : రిజిస్ట్రేషన్ శాఖ తరచూ పెడుతున్న నిబంధనల కారణంగా కక్షిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల తీసుకువచ్చిన 2.0 విధానం ద్వారా రిజిస్ట్రేషన్‌లు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. దీని ద్వారా సర్వర్ పూర్తిస్థాయిలో పనిచేస్తేనే రిజిస్ట్రేషన్లు సజావుగా జరుగుతాయి. ఈ విధానం వచ్చిన తర్వాత అప్పుడప్పుడూ కొన్ని ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రెండు గంటలపాటు సర్వర్ పనిచేయకపోవడంతో జిల్లాలో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్‌ల కోసం ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన కక్షిదారులు ఇబ్బందులు పడ్డారు. తరువాత మరలా సాయంత్రం నాలుగు గంటల తరువాత సర్వర్ పనిచేయడంతో యధావిధిగా రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ప్రస్తుత కొత్త విధానంపై ఇంకా అనేకమంది కక్షిదారులకు తెలియని పరిస్థితి. రానున్న రోజుల్లో ఈ విధానంలో మరికొన్ని మార్పులు వస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికి రిజిస్ట్రేషన్ శాఖ తీసుకువస్తున్న విధానాల ద్వారా కక్షిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పొలం, స్థలాలు, ఇల్లు కొనుగోలు విషయంలో లక్షల రూపాయలు ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ రూపంలో చెల్లిస్తున్నా రిజిస్ట్రేషన్‌లు మాత్రం సజావుగా జరగడం లేదని వాపోతున్నారు. తరచూ సర్వర్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కక్షిదారులు కోరుతున్నారు.

ఊరు మారలేదు!

ఆంధ్రజ్యోతి విలేజ్ విజిట్



బాడవ గ్రామంలో కలుషితమైన తాగునీటి చెరువు



గుంతలు పడి అధ్వానంగా ఉన్న బాడవ ప్రధాన రహదారి

బాడవ.. సమస్యల కడవ

- గోదావరి తీర గ్రామం.. అభివృద్ధిలో అధమం
- తాగేందుకు స్వచ్ఛ నీరు కొనాల్సిందే
- డ్రెయిన్లు లేక.. పారని మురుగునీరు
- రహదారులపై ప్రయాణం నరకం

బాడవలంక.. యలమంచిలి మండలంలోని గోదావరి తీర గ్రామం. ఏటిగట్టుకు, గోదావరికి మధ్యలో ఉన్న ఈ 'ఊరు మారింది' అంటూ అధికార పార్టీ ఊదరగొడుతోంది. కాని, ఊరు ఏమీ మారలేదని అక్కడి పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. కనీస మౌలిక వసతులు లేవు. గోదావరి పక్కనే ఉన్నా తాగు నీటిని కొనుక్కుని తాగాల్సిందే. 863 కుటుంబాలున్న ఈ ఊరిలో ఏ వీధికి వెళ్లినా డ్రెయిన్లు కనిపించవు. ఫలితంగా ఎక్కడికక్కడ మురుగునీరు పేరుకుపోయింది. ప్రజలు తమ ఇంటి ముందే మురుగునీటి గొయ్యిలు ఏర్పాటు చేసుకున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య తీవ్రత చాలా ఎక్కువ. దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో మురుగు నీరు రహదారుల చెంత పొంగి పొర్లడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.

- యలమంచిలి

ప్రధాన రహదారులు అధ్వానం

ఏనుగువానిలంక నుంచి బాడవకు వెళ్లే రహదారి అధ్వాన స్థితికి చేరింది. చాలాచోట్ల పెద్ద ఎత్తున గుంతలు పడి.. రాళ్లు తేలి ఉండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహ కూడలి నుంచి గ్రామ ప్రధాన కూడలి వరకు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన సీసీ రహదారిపై పగుళ్లు ఏర్పడి గోతులమయంగా మారింది. ప్రస్తుతం ఈ రోడ్డును అభివృద్ధి చేసే నాథుడే లేడు. టీడీపీ హయాంలో సీసీ రహదారులు నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కేవలం నాలుగు రహదారులను అభివృద్ధి చేశారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు కేటాయించిన నిధులతో కమ్యూనిటీ హాలును నిర్మిస్తున్నారు. అది కూడా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చొరవ చూపి ఎంపీ నిధులు రాబట్టారు. లేదంటే దీనికి నోచుకునేవారు కాదు. ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక నిధులు విడుదల చేయడం నిలిపివేయడం శాపంగా మారింది.





సిబ్బంది లేక ఖాళీగా గ్రామ సచివాలయం.. డ్రెయినేజీ లేక స్థానికులు ఏర్పాటు చేసుకున్న మురుగు గుంత

సిబ్బంది కొరత.. అరకొర సేవలు

బాడవ గ్రామ సచివాలయాన్ని నిర్మించినట్టు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ సిబ్బంది లేకపోవడంతో పనుల నిమిత్తం వెళ్లే గ్రామస్థులకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర సచివాలయానికి చెందిన కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా నియమించారు. వీఆర్వో.. గ్రామ సర్వేయర్, జూనియర్ లైన్‌మెన్ మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఇన్‌చార్జులుగా వున్న సచివాలయ సిబ్బంది కొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. దీనివల్ల సక్రమంగా సేవలందడం లేదని స్థానికులు వాపోతున్నారు.

రోజు విడిచి రోజే తాగు నీరు

గ్రామంలో చాలా ఏళ్లుగా రోజు విడిచి రోజు మాత్రమే కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మేడిచర్ల వారివీధి ప్రాంతంలో వున్న 50 కుటుంబాలకు తాగు నీరందడం లేదు. గ్రామంలో ఉన్న మంచినీటి చెరువులో నీరు కలుషితమవుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఈ చెరువులోకి కలుషితమైన జలాలు చేరుతున్నాయి. ఏనుగువానిలంక గ్రామ శివారులో ఈ చెరువుకు నీరు వచ్చే కాలువ ఉంది. దాని చెంతనే పెద్దఎత్తున వ్యర్థాలు వేయడంతో తాగు నీటి కలుషితానికి మరో కారణమవుతోంది. కుళాయిల ద్వారా అందించే నీటిని అధిక శాతం గ్రామస్థులు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వాడుకోవడం గమనార్హం. తాగు నీటి అవసరాలు తీరడం లేదు. ఓఎన్‌జీసీ ఆర్థిక సహకారంతో స్థానికంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటు నీటిని కొనుగోలు చేసి తాగేందుకు వాడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

వేధిస్తున్న లో ఓల్టేజీ సమస్య

గ్రామంలోని బంగారుతిప్ప నుంచి శివారు వరకూ ఉన్న ప్రాంతంలో నివశిస్తున్న గృహాలకు లో ఓల్టేజి విద్యుత్తు సమస్య ఉండడంతో ఆ ప్రాంతంలోని విద్యుత్తు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవి వస్తే సమస్య మరింత తీవ్రమై అవస్థలు పడుతున్నామని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. చాలాచోట్ల విద్యుత్ తీగలు తుప్పుపట్టిపోయాయి. పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని సరిదిద్దే ప్రయత్నం చేయడం లేదు. విద్యుత్ శాఖ దృష్టి పెట్టలేదు.

ఉత్సవ విగ్రహాలుగా మారాం



- వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘ నిధులను కొంతకాలం క్రితం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు రాకుండా చేయడంతో గ్రామంలో ప్రధాన సమస్యలను పరిష్కరించే అవకాశం లేక పోయింది. నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాలకు సైతం సర్పంచ్‌ను ఆహ్వానించడం లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన అరకొర ఆర్థిక సంఘం నిధులు సిబ్బంది వేతనాలకు సరిపోతున్నాయి. అభివృద్ధికి గ్రామం నోచుకోవడం లేదన్న బాధ ఉంది.

- రాయి వీరవెంకటదుర్గ, సర్పంచ్, బాడవ

అభివృద్ధిని గాలికొదిలేశారు



- ఏనుగువానిలంక నుంచి బాడవ గ్రామానికి వచ్చే రహదారి, శ్రీకృష్ణదేవరాయుల విగ్రహ కూడలి నుంచి గ్రామ ప్రధాన కూడలి వరకు ఉన్న రహదారుల అధ్వానస్థితికి చేరాయి. ఈ మార్గాల్లో రాకపోకలకు అవస్థలు పడుతున్నా.. ప్రస్తుతం వీటిని అభివద్ధి చేసే నాథుడే కరువయ్యారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం టీడీపీ హయాంలో ఈ మార్గాలను అభివృద్ధి చేశారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- రాయి శ్రీనివాస్, బాడవ గ్రామస్థుడు

సొంత నిధులతో కైలాసవనం అభివృద్ధి



దాత రాయి సత్యనారాయణ

బాడవ గ్రామ సర్పంచ్ రాయి వీరవెంకటదుర్గ భర్త సత్యనారాయణ ఆర్థిక సాయంతో గ్రామంలో కైలాసవనం అభివృద్ధికి ఇటీవల శ్రీకారం చుట్టారు. తన తల్లిదండ్రులు దివంగత రాయి నర్సింహ మూర్తి, వెంకటనర్సమ్మ జ్ఞాపకార్థం కైలాస వనాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శ్మశాన వాటిక వద్ద మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలనే సత్సంకల్పంతో కైలాస వనాన్ని సొంత నిధులు రూ.15 లక్షలు వెచ్చించారు. కైలాసవనంలో మౌలిక వసతులు, దహన పేటికలు, రెండు భవనాలు.. ఒకటి దహన సంస్కారాలు నిర్వహించేందుకు.. మరొకటి వచ్చిన వారు కూర్చునేందుకు అభివృద్ధి చేస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రాంతంలో పరమ శివుని విగ్రహ ఏర్పాటుకు, పరిసరాల సుందరీకరణకు కార్యాచరణ రూపొందించడమే కాక నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. కైలాసవనాన్ని అభివృద్ధి చేయడం స్ఫూర్తిదాయకమని గ్రామస్థులు దాతను అభినందిస్తున్నారు.



కైలాసవనం

కులగణనపై కుస్తీ

- ఆస్తుల వివరాలను సేకరిస్తున్న వలంటీర్లు.. ఆందోళనలో జనం
- స్థలాలు ఉన్నాయంటూ ఇది వరకే సంక్షేమ పథకాల్లో కోత
- కులాల కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- పదవులకే పరిమితం.. నిధులు శూన్యం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కులగణన జరుగుతోంది. వివరాల కోసం వలంటీర్లను రంగంలోకి దింపింది. వాస్తవానికి ఇది వరకే అనధికారికంగా కులాల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రస్తుతం అధికారికంగా చేపడుతున్నారు. త్వరలోనే గణన ముగియనుంది. జిల్లాలో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వివరాలను సేకరిస్తున్నారు. ఉపకులాల జాబితాను సిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు ఆస్తుల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఇదే ఇప్పుడు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కులాల ఆర్థిక స్తోమతను అంచనా వేసి తగు ఫలాలు అందించేందుకు దోహదపడుతోందని ప్రభుత్వం చెప్పుకొస్తోంది. ఆస్తుల వివరాలను తేటతెల్లం తేస్తే సంక్షేమ ఫలాల్లో కోత పడుతుందంటూ జనం ఒకింత ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 6,44,896 కుటుంబాలు, 18,01,616 మంది జనాభా ఉన్నారు. అందరి వివరాలను వలంటీర్లు నమోదు చేసుకుంటున్నారు. కులగణన కోసం ప్రభుత్వం జిల్లాలో 7,051 మంది యానిమేటర్లను నియమించింది. మరో 1,107 సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసింది. వారి పర్యవేక్షణలో వలంటీర్లే కులాల వివరాలను సేకరిస్తున్నారు. ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల వివరాలను తీసుకుంటున్నారు. గతంలో పట్టణాల్లో ఇళ్ల స్థలాలు ఉన్నాయంటూ సంక్షేమ పథకాలను రద్దు చేశారు. అమ్మ ఒడిని నిలిపి వేశారు. పెన్షన్ రద్దు చేశారు. కాపు నేస్తం అమలు చేయలేదు. ఇలా స్థలాల పేరుతో ఎంతో మందికి సంక్షేమ పథకాలు రద్దయ్యాయి. తాజాగా సేకరిస్తున్న ఆస్తుల వివరాలతో మున్ముందు మరింత నష్టం జరిగే అవకాశం ఉందన్న భావన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 50 శాతం కుటుంబాల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు.

కులాల కార్పొరేషన్‌లు

ప్రభుత్వం కులాల వారీగా కార్పొరేషన్‌లు నియమించింది. బీసీల్లోని 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేశారు. ఒక్కో కులానికి ఒక్కో కార్పొరేషన్. దానికి ఒక చైర్మన్. అనేక మంది డైరెక్టర్లు. ఇంకే ముందు కులాల వారీగా మేలు చేకూరుతుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో అబ్బురపడిపోయారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులు ఇచ్చారు. గౌరవ వేతనం కల్పించారు. పదవులు పొందిన వారంతా తొలి రోజుల్లో హడావుడి చేశారు. తమ వాహనాలపై కార్పొరేషన్‌లో పొందిన పదవులతో పేరు ఫలకాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం సచివాలయంలో వారికి ఎటువంటి సీటు కేటాయించలేదు. పేరుకే పదవులు. నిధులు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలనే కార్పొరేషన్‌ల ఖాతాలో చేర్చింది. అంటే గతంలోనే కులాల వారీగా వివరాలు సేకరించినట్టు అర్థమవుతోంది. ఎప్పటి నుంచో అమలు జరుగుతున్న రైతు భరోసా, వృద్ధాప్య పెన్షన్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల్లో లబ్ధి పొందిన నిధులను కులాల కార్పొరేషన్‌లో చేర్చారు. ఇలా ఒక్కో కార్పొరేషన్‌కు ఎంత మొత్తంలో వెచ్చించారో ప్రభుత్వం చెప్పుకుంటూ వస్తోం ది. అంతేతప్ప ప్రత్యేకంగా కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించిన పాపాన పోలేదు.

నిధులు దారి మళ్లింపు

కులగణనతో సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లడానికి అవకాశం ఉంటుందని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో పక్కదారి పడుతోంది. నిధులను దారిమళ్లిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను మళ్లించింది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసింది. అటు వంటిది ఇప్పుడు కులగణన అంటూ ఊదరగొడుతోంది. తెల్లరేషన్ కార్డు కొలమానంగా అందరికీ చేపడుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని కులాల కార్పొరేషన్‌లదేనంటూ చెప్పుకొస్తోంది. ఇలా జనాలను ఏమారుస్తోంది. వైసీపీ ప్రభుత్వ వైఖరితో కులగణన వల్ల ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆసరా కావాలా.. వద్దా ?

- సమావేశానికి హాజరుకండి.. డ్వాక్రా మహిళలపై ఒత్తిళ్లు

భీమవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా అమలుచేస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బటన్‌నొక్కారు. డ్వాక్రా మహిళల ఖాతాల్లో సొమ్ములు జమ కానున్నట్టు ప్రకటించారు. కాని, జిల్లాలో ఇప్పటి వరకు ఎవరికీ జమ కాలేదు. మహిళలు బ్యాంకులకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఆసరా సొమ్ములు జమ కాలేదంటూ బ్యాంకు సిబ్బంది చెపుతున్నారు. దీంతో వారు ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. ఈలోగా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు నిర్వహిస్తున్న సమావేశాలకు డ్వాక్రా మహిళలు తప్పనిసరిగా హాజరు కావాలంటూ ఆర్పీలు చెబుతున్నారు. లేదంటే ఆసరా సొమ్ములు జమ కావంటూ హెచ్చరిస్తున్నారు. దీంతో తప్పనిసరిగా మహిళలు సమావేశంలో పాల్గొంటున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో శనివారం ఇదే జరిగింది. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆసరా సమావేశం ఏర్పాటుచేశారు. డ్వాక్రా మహిళలంతా హాజరుకావాలని ఆర్పీలు ఆదేశించారు. దీంతో సభ్యులంతా పనులు మానుకుని సమావేశానికి హాజరయ్యారు. సభ ముగియకుండానే మధ్యలోనే వెనుదిరిగారు. నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలను బలవంతంగా రప్పిస్తున్నారు. తప్పనిసరి అంటూ చెప్పుకొస్తున్నారు. సభలకు హాజరైన తర్వాత ఆసరా సొమ్ముల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో 27,004 స్వయం సహాయక సంఘాలున్నాయి. సుమారు 2,37,441 మంది సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా అమలు చేస్తున్నారు. ఇందు కోసం రూ. 275.90 కోట్లు జమ చేయాల్సి ఉంది. సీఎం బటన్ నొక్కారు. నియోజకవర్గాల్లో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. అయినా సరే సొమ్ముల కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.



అబ్బిరాజుపాలెంలో మట్టి తవ్వకాలు

అడ్డుకున్న స్థానికులు - 5లో..

5లో..

తవ్వే కొద్దీ తప్పులు

- చనిపోయిన వారికి ఓట్లు.. బతికున్న వారికి తొలగింపులు
- వెలుగుచూస్తున్న తప్పులు
- ఆందోళనలో ఓటర్లు, పార్టీలు

భీమవరం/ భీమవరం టౌన్, జనవరి 27 : చనిపోయిన వారి ఓట్లు ఓటర్ల జాబితాలో అలానే ఉన్నాయి. ఓటర్ల ముసాయిదా జాబితాకు ముందే వారు లేకపోయినప్పటికీ ఈ కార్యక్రమంలో పేర్లు తొలగించలేకపోయారు. ఈ నిర్లక్ష్యం ఎవరిదనే ప్రశ్న పక్కన పెడితే తనిఖీలో వహించిన నిర్లక్ష్య వైఖరే కారణంగా చెప్పవచ్చు. ఓట్ల జాబితాలో ఉన్నవారు చనిపోతే కుటుంబసభ్యుల ద్వారా మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని తొలగించాలి. ఆ ప్రక్రియ ఎవరు చేపట్టాలనే దానిపై సరైన స్పష్టత లేని కారణంగా తొలగింపు జరగలేదు. మరో వైపు జీవించి ఉన్న వారి పేర్లు తొలగించారు. చనిపోయిన వారికి రెండుచోట్ల ఓటున్న ఘటనలు బయటకు వచ్చాయి. ఇలా నిర్లక్ష్యం కారణంగా అనేకచోట్ల ఓట్లు పదిలంగానే ఉన్నాయి.

- భీమవరంలో 7వ వార్డు 47వ పోలింగ్ బూత్‌లో లింగ పోడూరి అనే మహిళ ఓటును జాబితా నుంచి తొలగించారు. ఇలా ఎందుకు జరిగిందో తెలియదు.
- భీమవరం 25వ వార్డు 89 పోలింగ్ బూత్‌లో 799 నెంబరు గల మహిళ నవుడు సన్యాసమ్మ చనిపోయి చాలా కాలమైనా ఓటు తొలగించలేదు. ఈ పోలింగ్ బూత్‌లో ఐదుకుపైగా ఇలాంటివి ఉన్నట్లు గుర్తించారు.
- 90 పోలింగ్ బూత్‌లో బాడా వెంకటలక్ష్మి అనే మహిళకు 136 నెంబరుగా ఓటు ఉంది. అలాగే 86 పోలింగ్ బూత్‌లో 141 ఓటుగా నమోదైంది.
- 90 బూత్‌లోనే ఈదర సత్యవేణి అనే మహిళ ఓటు 88, 89గా పక్కపక్కనే రెండు ఓట్లు తుది జాబితాలో కనిపించింది. ఇలా చాలా సంఘటనలు కనిపిస్తున్నాయి.
- భీమవరం మండలం అనాకోడేరులో 159 పోలింగ్ బూత్ పరిధిలో చనిపోయిన వారి ఓట్లను అలాగే ఉంచారు. ఇక్కడ చనిపోయినట్లు నివేదికలు ఇచ్చినప్పటికీ వారి ఓట్లను తొలగించలేదు. ఓట్ల జాబితాలో వున్న 723, 730, 766, 781 నెంబర్లలో ఉన్న వారి ఓట్లు అలాగే ఉన్నాయి.
- తుది ఓటర్ల జాబితాలో ముదినేపల్లికి చెందిన పలువురి రూపురేఖలే మారిపోయాయి. జాబితాలో పేర్లు బాగానే ఉన్నా ఫొటోల్లో పోలికలు లేవు. పెద్ద సంఖ్యలోనే ఓటర్ల ఫొటోలు గుర్తించేందుకు వీలు లేదు. ముఖాలు తెలుపు, నలుపు రంగుల్లో కనిపించడం లేదు. ఓటర్లే పేరు చూసుకుని ఫొటో ఎవరిదో తెలుసుకోలేకపోతున్నారు.




సత్యవేణి ఈదరకు రెండు ఓట్లు



బాడా వెంకటలక్ష్మికి రెండు ఓట్లు



చనిపోయిన వారికి ఓట్లు ఉంచారు..



బతికున్నా ఓటు తొలగించారు



రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ

పెనుగొండ, జనవరి 27: వరి పంట దిగుబడిని తగ్గించే సమస్యలలో పురుగులు, తెగుళ్లతో పాటు ఎలుకలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వరి పరిశోధనా స్థానానికి చెందిన ఎలుకల విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. పెనుగొండ మండలం చినమల్లం గ్రామంలో దత్తత పథకంలో భాగంగా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, అనూష పాల్గొని ఎలుకల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. వరి పంటపై ప్రధానంగా రెండు జాతులు ఎక్కువగా దాడి చేస్తాయన్నారు. పొలం గట్లపై ఏ విధమైన కలుపు గడ్డిలేకుండా చూసుకోవాలన్నారు. కన్నం చుట్టు ఉన్న పగుళ్ళను మట్టితో మూసివేసి కనీసం 3 నిమిషాలు పాటు పొగ వదలడం ద్వారా ఎలుకలు ఊపిరాడక చనిపోతాయన్నారు. సుమారు 200 కిలోల బ్రోమోడయోల్ ఎర మందును రైతులకు అందజేశారు.మండల వ్యవసాయాధికారి స్పందన, డాక్టర్ ఎంవీ కృష్ణాజి, డాక్టర్ ఆనంద్ కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సంక్షేమం కోసం బీమా

అప్సడా వైస్ చైర్మన్ రఘురాం



రొయ్య రైతుల సభలో మాట్లాడుతున్న అప్సడా వైస్ చైర్మన్ రఘురాం

వీరవాసరం, జనవరి 27: ఆక్వారైతుల సంక్షేమం కోసం రొయ్యల పంటల బీమా పథకాన్ని అమలు చేయటానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఏపీ స్టేట్ ఆక్వా డవలప్ మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టనున్న రొయ్యల పంటల బీమా పథకంపై వీరవాసరంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి మళ్ల తులసి రాంబాబు అధ్యక్షత వహించారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేశారు. బీమా పథకాన్ని ఆంధ్రప్రదేశ్,గుజరాత్ రాష్ట్రాలలో పైలట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయటానికి ముందుకు వచ్చిందన్నారు. రైతులు వ్యక్తం చేసిన అనుమానాలను, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అందరికీ ఆమోద యోగ్యమైన బీమా పథకం ప్రవేశపెట్టేలా చూస్తామని తెలిపారు. రొయ్యల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మోహనరాజ్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, డీఎఫ్‌వో అంజలి, మండల రొయ్యలరైతు సంఘం ప్రతినిధులు యరకరాజు గోపాలకృష్ణంరాజు, మళ్ళ శ్రీరామమూర్తి, నాగరాజు గోపిరాజు, గుండా నర్సింహారావు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



ద్వారకాతిరుమల, జనవరి 27: ద్వారకా తిరుమల ఆలయం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దాదాపు 15 వేల మందికి పైగా భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా. దర్శనానంతరం శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని యాత్రికులు స్వీకరించారు.

జిల్లా వెబ్‌సైట్లో వైద్య ఉద్యోగార్థుల తాత్కాలిక మెరిట్ జాబితా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 27 : రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య డైరెక్టర్ పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును జిల్లా వెబ్‌సైట్‌లో పొందుబర్చినట్టు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలోని వివరాలపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రాజ మహేంద్రవరంలోని తమ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా ఇ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. తాత్కాలిక మెరిట్ జాబితాలను పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల వెబ్‌సైట్లలో కూడా పొందుపరిచినట్టు వివరించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

జంగారెడ్డిగూడెం, జనవరి 27 : 67వ రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల బాలికల టెన్నికాయిట్ పోటీలు జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరగనున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

నేడు, రేపు అంతర్ జిల్లాల అండర్-19 బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు

ఉంగుటూరు, జనవరి 27 : ఉంగుటూరు మండలం నారాయణపురంలో 45వ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలు ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. టోర్నీ ఏర్పాట్లను పూర్తిచేసినట్టు తెలిపారు. 16 జట్లు సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి అంటే ఆసుపత్రికి డోలీలో తీసుకువెళ్లడమేనా : సీపీఐ రామకృష్ణ

కుక్కునూరు, జనవరి 27 : గిరిజన గ్రామాల నుంచి గర్భిణులను, అనారోగ్య బాధితులను ఆసుపత్రికి డోలీల్లో తీసుకువెళ్లడమేనా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సాధించిన అభివృద్ధి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. కుక్కునూరు మండలం జిన్నెలగూడెం వలస ఆదివాసీ మహిళ పురిటినొప్పులతో ప్రసవ వేదన పడుతుంటే గ్రామస్థులు డోలీ కట్టి ఆసుపత్రికి తరలించిన ఘటనపై రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. శనివారం ఆయన పత్రికలకు ఒక లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. గిరిజన గ్రామాల ప్రజల సౌకర్యార్థం రహదారి మార్గాలు ఏర్పాటు చేయాలని, వైద్య సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.



జైల్ తనిఖీ చేసిన న్యాయాధికారి

భీమవరం క్రైం, జనవరి 27 : బెయిల్‌పై బయటకు వెళ్ళిన వారు కేసు పూర్తయ్యే వరకు ప్రతీ వాయిదాకు హాజరు కావాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ధనరాజు అన్నారు. శనివారం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ధనరాజు స్థానిక ప్రత్యేక కారాగారాన్ని తనిఖీ చేశారు. ముందుగా వంటశాలను, ఆహార పదార్థాలను, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. జైల్ విజిటింగ్ లాయిర్ లోకేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ భవాని, కృపానందం, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.



గోశాలకు రూ. 5 లక్షల విరాళం

ఉంగుటూరు, జనవరి 27 : ఉంగుటూరు మండలం నాచుగుంట గోపాలకృష్ణ గోశాలలో ప్రకృతి వ్యవసాయ శిక్షణకు దాతలె రూ. 5 లక్షల విరాళం అందజేశారు. తాడేపల్లిగూడేనికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుమార్తె పసల కృష్ణభారతి రూ.5 లక్షల విరాళాన్ని తన తండ్రి కృష్ణమూర్తి జయంతి పురస్కరించుకుని అందించారు.



సైరన్

అడిగేవారెవరు..ఆపేవారెవరు..!

చోటా, బడా నాయకుల వాహనాలకూ సైరన్లు

అదేబాటలో కొందరు అధికారులు

నిబంధనలు బేఖాతర్

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 27 : అత్యవసర సేవలైన పోలీస్, అగ్ని మాపకదళం, రవాణాశాఖ, అంబులెన్స్‌లు మినహా మరే ఇతర వాహనాలకు అత్యవసర సైరన్‌లను వినిగించరాదని మోటార్ వెహికల్ చట్టం చెబుతుంది. అయితే ఈ నిబంధనలను జిల్లాలోని కొందరు నాయకులు, అధికారులు పెడచెవిన పెట్టి రోడ్లపై సైరన్‌లు మోగిస్తూ రయ్ రయ్‌మంటూ దూసుకు పోతున్నారు. చట్టాలను అమలు పరిచే అధికారులు, ప్రజలచే ఎన్నుకోబడ్డ నాయకులు కనీస అవగాహన లేకుండా సైరన్‌లను వినియోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొందరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు వంటి అధికారులు, సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రుల అనుచరులు విచ్చలవిడిగా సైరన్‌లను వినియో గించడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అనధికార సైరన్‌లతో ప్రజల్లో గందరగోళానికి గురిచేస్తూ కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కూడా వాహనాన్ని నిలపకుండా దూసుకుపోతున్నారు. జంగారెడ్డిగూడెంలో అనధికార సైరన్‌లు వినియోగించే వాహనాలకు కొదవే లేదు.

సైరన్‌లతో చట్ట విరుద్ధ పనులు

మరోవైపు కొందరు ఆకతాయిలకు ఈ సైరన్‌లు ఆటవస్తువులుగా మారాయి. రోడ్లపైకి రావడం సైరన్‌ల మోత మోగించడం అలవాటైపోయింది. వాహనాలకు సైరన్‌లను ఏర్పాటు చేసి చట్ట విరుద్ధమైన పనులకు కొందరు ఆకతాయిలు పాల్పడుతున్నారు. టోల్‌ప్లాజాల వద్ద సైరన్ మోగిస్తూ టోల్‌ఫ్రీ చెల్లించకుండా ఉడాయించడం, అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా సిగరెట్లు, బెల్టు దుకాణాల వద్ద సరుకు తీసుకొని సైరన్ మోగిస్తూ ఆకతాయిలు చెక్కేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భారీ జరిమానా విధిస్తాం



అత్యవసర సేవలందించే వాహనాలు మినహా మిగిలిన వాహనాలకు రవాణాశాఖ అనుమతి లేకుండా సైరన్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. దీనిపై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తాం. సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

- ఎండీ మదాని, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, జంగారెడ్డిగూడెం

ఎప్పుడు ..ఎవరు వాడాలి ?

అత్యవసర సమయంలో ఘటనా స్థలానికి వెళ్లే ముందు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు సైరన్‌ను వినియోగిస్తారు. రోగి, క్షతగాత్రుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ప్రాణాలను రక్షించే క్రమంలో అంబులెన్స్ సైరన్‌ను వాడతారు. (రోగి ప్రాణాల దృష్ట్యా అంబులెన్స్‌లకు కొన్ని ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. కొందరు రోగులను తరలించే క్రమంలో సైరన్ వేయకూడదనే నిబంధన ఉంది.) మంటలను ఆర్పే క్రమంలో అగ్నిమాపకదళం సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేస్తూ ఘటనా స్థలానికి చేరుకుంటారు.



పులి బాబోయ్ పులి !

భయంతో వణుకుతున్న జనం

పెరుగుగూడెం, మేదినరావుపాలెంలో కలకలం

దెందులూరు, జనవరి 27 : పులి..బాబోయ్ పులి.. అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. పులి పశువుని తింటున్న వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం అవుతుండటంతో గ్రామాల్లోని ప్రజలందరూ భయందోళన చెందుతున్నారు. కూలీలు, రైతులు పనులకు వెళ్లడం మానేశారు. రైతులు పాలు తీసుకునేందుకు పొలాల్లోకి వెళ్లడం లేదు. శనివారం దెందులూరు మండలం మేదినరావు పాలెం పోలవరం కాల్వ పక్కనే ఉన్న గట్టు వద్ద పులి అడుగులు కనిపించడంతో గ్రామస్థులు పెద్ద ఎత్తున కర్రలు, గునపాలతో వెతికారు. పులి అడుగుల గుర్తులు కనిపిం చడంతో వీఆర్వోకి సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులకు సమా చారం ఇచ్చారు. శుక్రవారం పెరుగుగూడెం గ్రామానికి చెందిన యలమర్తి బాపారావు కుమారుడు వేణుగోపాల్‌కు చెందిన గేదెల పాక వద్ద, మొక్కజొన్న తోటలో పులి తిరిగిన గుర్తులు ఉన్నాయంటూ అందిన సమా చారం మేరకు అటవీ శాఖ అధికారి కుమార్ సిబ్బందితో వచ్చి గుర్తులను పరిశీలించారు. ద్వారకా తిరుమల మండలం సత్తెనపల్లిలోను అదేరోజు పులిగుర్తులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. పెరుగు గూడెం, సత్తెనగూడెంలో ఉన్న అడుగులు పులివే అని చెప్పారు. కానీ అడవి నుంచి 30 కిలోమీటర్ల వరకూ బయటకు వచ్చి ప్రయాణించిన పులి జంతువులు, పశువులమీద గానీ దాడి చేయలేదని తిరిగి వెళ్లిందా లేక ఇక్కడే ఉందా అనే దానిపై స్పష్టత కోసం పోలీసు, అటవీశాఖ సిబ్బంది విచారిస్తున్నారని తెలిపారు. నాలుగు గ్రామాల ప్రజలు ఒంటరిగా పొలాల్లోకి వెళ్లవద్దని ఏవిధమైన సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నంబర్ 1800-4255909కు ఫోన్ చేయాలని కుమార్ తెలిపారు.



మేదినరావుపాలెం మొక్క జొన్న తోటలో పులి కాలు గుర్తులు

తెలిపారు.ఎస్ఐ కిరణ్ కుమార్ అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వగా ఫారెస్ట్ రేంజర్ కుమార్ తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అడవి పందుల గుంపు వచ్చి ఉంటుందని, వాటి పదునైన దంతాలతో పైపులైన్లు, పంటను నాశనం చేసి ఉంటాయని వివరించారు. నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల ప్రాంతాలలో పెద్ద పులి తిరుగుతుందంటూ ఆయా మండలాల ప్రజలు భయాందోళన చెందుతు తున్నారని భయం అవసరం లేదన్నారు.

యర్రమిల్లిపాడు మొక్కజొన్న చేలల్లో ...



ఉంగుటూరు, జనవరి 27 : ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు రైతు పోతురాజు మొక్కజొన్న చేలో పాదముద్రలు కనిపించాయి. పలుచోట్ల పంట పాడు చేయడంతో పాటు పైపులైను ధ్వసం అవ్వడంతో రైతులు అనుమానం వచ్చి చేబ్రోలు పోలీసులకు

అవి పులి పాద ముద్రలే..

ఏలూరు, జనవరి 27: ఏలూరు సెక్షన్ రామసింగవరం బీట్ పరిధిలో గల దెందులూరు మండలం పెరుగుగూడెంలో సంచరిస్తున్న జంతువు పాద ముద్రల పరిశీలించిన పిమ్మట పెద్దపులి పాదముద్రలుగా నిర్ధారించి నట్టు జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా గాయపరచుట గానీ, చంపుట గానీ, చేసినట్లయితే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు.

భయపడాల్సిన అవసరం లేదు : ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 27 :పలు మండలాల్లో పులి సంచారమని వస్తున్న వార్తలు నమ్మి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారంపై అటవీశాఖ, పోలీస్‌శాఖ అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టారన్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, 112 నంబర్లకు, ఏలూరు పోలీస్ కంట్రోల్ 83329 59179 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ రాము సత్యనారాయణ.. భక్తుల కోలాట ప్రదర్శన

ధర్మ ప్రచార మహోత్సవాలు ప్రారంభం

పాలకొల్లు టౌన్, జనవరి, 27 : పాలకొల్లు క్షీరారామలింగేశరస్వామి ఆలయంలో ధార్మిక పరషత్, దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ధర్మ ప్రచార మహోత్సవాలను శనివారం దేవదాయశాఖ కమిషనర్ రాము సత్యనారాయణ ప్రారంభించారు. ఆలయ అర్చకులు, పండితులు ముందుగా విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి సామూహిక మంగళగౌరి కుంకుమ పూజలు నిర్వ హించారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ కోరాడ శ్రీనివాసరావు, ఆవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, అధికారి వెంకట సుబ్బారావు, మావుళ్లమ్మ ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యాన్ ఢీకొని మోటారు మెకానిక్ మృతి



ఆకివీడు, జనవరి 27: బొలెరా వాహనం ఢీకొని మోటారు సైకిల్ మెకానిక్ మృతి చెందాడు. ఆకివీడు సంతమార్కెట్ ప్రాంతంలో ఉంటున్న నడింపల్లి సాయి చందు (25) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శనివారం షాపునకు వెళుతుండగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆకివీడు నుంచి అయి-భీమవరం వైపు వెళ్లుతున్న బొలెరా వేగంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి సిద్ధూ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేశారు. హెల్మెట్ ధరించి ఉంటే మరణించేవాడు కాదని ఎస్ఐ అన్నారు. హెల్మెట్లు ధరిస్తే కుటుంబాలు రోడ్డున పడవన్నారు. సంతాప సూచికంగా మెకానిక్ దుకాణాలు మూసివేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెదపాడు, జనవరి 27 : పెదపాడు గ్రామానికి చెందిన తోట సాయి కిషోర్ (48) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లుగా పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. సాయికిషోర్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక శుక్రవారం రాత్రి పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం చినఅవుటపల్లి పిన్నిమనేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం..కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 27 : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము శ్యాంబాబు ఈ నెల 24వ తేదీన బంధువులు అనారోగ్యంతో ఏలూరు ఆసుపత్రిలో చేరడంతో చూడడానికి వెళ్లాడు. ఉదయం ఇంటికి వచ్చి చూస్తే తన భార్య కన్పించలేదని, చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

సారా విక్రయం.. కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 27 : సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. బందంచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో శనివారం సిబ్బందితో దాడి చేసి 8 లీటర్ల సార స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రావులపర్రులో 90 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఉంగుటూరు,జనవరి 27 : ఉంగుటూరు మండలం రావులపర్రులో శనివారం సాయింత్రం చేబ్రోలు పోలీసులు అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 90 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మణిమణికుమార్ తెలిపారు.గ్రామానికి చెందిన కొనకళ్ళ వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

పెదవేగి, జనవరి 27 : పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ చేశారని ఏఎస్ఐ పి.జోసెఫ్ తెలిపారు కొప్పులవారిగూడెం గ్రామానికి చెందిన మాదాల ఫణీంద్రకు చెందిన వ్యవ సాయ మోటారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు రోజుల కిందట గుర్తు తెలి యని దుండగులు పగులగొట్టి అందులో ఉండే రాగివైరును చోరీ చేశారు. పెదవేగి ట్రాన్స్‌కో ఏఈ నాగేషుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

పది రోజులుగా సెల్‌టవర్ పైనే..



భీమవరం క్రైం, జనవరి 27 : భీమవరం మండలం చినఅమిరం గ్రామా నికి చెందిన లోకం ఏసు జువ్వల పాలెం రోడ్డులో పది రోజులుగా సెల్‌టవర్ పైనే ఉంటూ న్యాయం చెయ్యాలని కోరుతున్నాడు. తన తండ్రికి సంబం ధించిన ఇన్సూరెన్స్ పత్రాల బ్యాంక్ వారు ఇవ్వకుండా మోసం చేశారంటూ న్యాయం చెయ్యాలని కోరుతూ టవర్‌పైనే కూర్చున్నాడు. ఈనెల 18వ తేదీన ఉదయం 5 గంటల నుంచి టవర్‌పైనే ఉన్నాడు. ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా దిగడం లేదు. అయితే అతనికి ఆహారం ఎలా అందుతుంది ? రోజువారీ కార్యక్రమాలు ఎలా జరుగు తున్నాయి? అనేది పెద్ద ప్రశ్నగా మారింది.

భీమవరంలో చేతబడి కలకలం



భీమవరం క్రైం, జనవరి 27 : భీమవరం వన్‌టౌన్‌లోని మెంటేవారితోట పరిధిలో నివాసిత ప్రాంతాల మధ్యన చేతబడి కలకలం రేపింది. కొన్ని రోజులుగా ఆయా వీధుల్లోని కొందరి ఇళ్ళ ముందు నిమ్మకాయలు, కొబ్బరి, పసుపు, కుంకుమ ఇతరత్రా సామాగ్రి ఉంచి ఆందోళనకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోయారు. శుక్రవారం రాత్రి ఓ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలపై పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, నిమ్మకాయలు ఉంచడంతో ఆ ప్రాంత వాసు లంతా ఆందోళన చెందారు. విషయం తెలియడంతో పోలీసులు వెళ్లి సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు

26 మంది ఎంపీడీవోలు బదిలీ

ఏలూరుసిటీ, జనవరి 27: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల బదిలీలు ప్రారంభం అయినాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలలో బదిలీలు జరుగుతుండగా తాజాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 26 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు.వీరిలో 13 మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు, 13 మంది ఉమ్మడి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 10 మంది ఎంపీడీవో పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 15 మంది జిల్లాకు వచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎంపీడీవోలు వెంటనే రిపోర్టు చేయాల్సి ఉంది.

బదిలీ అయిన ఎంపీడీవోలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కె.శ్రీదేవి, జ్యోతిర్మయి, ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, జీఆర్ మనోజ్, కె.వాణి, ఎండీ అమీల్ జమా, కె.వెంకటలక్ష్మి, ఎం.మురళీకృష్ణ, సీహెచ్ త్రిశూలపాణి, ఏ.శ్రీనివాస్, కెఎస్ఆర్ కృష్ణప్రసాద్,టి.సూర్యనారాయణమూర్తిలు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్ఎం గంగాధరరావు ,సీహెచ్ పద్మావతి, ఆర్ బేబిశ్రీలక్ష్మి ,పి.శ్రీనివాస్ ,ఎస్.ఆశీర్వాదం, పి.శామ్యూల్, జి.విజయకుమారి ,బీఎస్ఎల్ మంగకుమారి, ఎం.విశ్వనాథ్ , కె.కిరణ్‌కుమార్, జీవీఎస్ రామకృష్ణంరాజు, ఎన్.ప్రేమాన్విత , కుంజా జ్యోతిలు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు.

బదిలీపై వచ్చిన వారు

వై.రామకృష్ణ, స్వామలత, పి.శ్రీనివాసరావు ,జె.స్వామభారతి, కె.జోగేశ్వర రావు, సీహెచ్ చిన రత్నాలు, టి.అనూహ్య, ఏవీ రమణ,పి.అనూష , సుధాప్రవీణ్‌లు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఎన్.బొజ్జి , కె.నరేంద్రరెడ్డి, కె.హిమా మహేశ్వరి, జెప ఝాన్సీ, కడలి పద్మజ్యోతి, పీఎస్ నరేష్‌కుమార్ , వెంకటరామన్, డీఎల్ఎస్ శర్మ, ఎం.ప్రేమ్‌సాగర్ , జిశివరామకృష్ణయ్య, మటపర్తి అన్నపూర్ణ, బి.అశోక్ కుమార్, డి.శ్రీలలిత, కె.రమేష్, ఎస్. సుబ్రహ్మణ్య శర్మ ఉమ్మడి తూర్పుగోదావరి పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చారు.



అబ్బిరాజుపాలెంలో మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న దృశ్యం

అబ్బిరాజుపాలెంలో మట్టి తవ్వకాలు

అడ్డుకున్న స్థానికులు..

అనుమతులు ఉన్నాయంటూ తరలింపు

యలమంచిలి, జనవరి 27: అబ్బిరాజుపాలెం లంకభూముల్లో తువ్వమట్టి తవ్వకాలు జరిపి లారీల్లో తరలిస్తుండగా పలువురు గ్రామస్థులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తహసీల్దారు సునీల్‌కుమార్, ఎస్ఐ శివన్నారాయణ సిబ్బందితో తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా తువ్వమట్టిని తరలించడమేమటని పలువురు గ్రామస్థులు, టీడీపీ, జనసేన నాయకులు అధికారులను ప్రశ్నించారు. కన్జర్వెన్సీ ఈఈ అనుమతులు ఇచ్చారని ఆడుదాం ఆంధ్రా కోసం మండలంలోని పాఠశాలల క్రీడా మైదానాల్లో వేసేందుకు మట్టిని తరలిస్తున్నామని చెప్పారు. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారుల దగ్గరుండి తువ్వమట్టి తవ్వకాలు జరిపించారు. అనుమతుల కాపీలను తమకు ఇవ్వాలని గ్రామస్థులు తహసీల్దారును అడగ్గా పత్రాల కోసం ఎంపీడీవోను సంప్రదించాలన్నారు. ఇదిలా ఉంటే ఆడుదాం ఆంధ్రా పోటీలు ముగిసిన తరువాత క్రీడామైదానాల్లో వేయడానికి మట్టిని తరలిచడం ఏమిటో విడ్డూరంగా ఉందని పలువురు గ్రామస్థులు చెవులు కొరుక్కుంటున్నారు. అధికారులు అనుమతులు ఉన్నాయని చెప్పడంతో కన్జర్వెన్సీ ఈఈ కి తాము ఫోన్ చేసి అనుమతులు ఇచ్చారా అని అడిగామని దీనిపై ఈఈ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని స్థానిక టీడీపీ, జనసేన నాయకులు చెబుతున్నారు. వైసీపీ పార్టీ కార్యాలయ ఆవరణలో నింపేదుకు మట్టిని తరలిస్తున్నారని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఈ ఏడాది నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు

జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్

ఏలూరు క్రైం, జనవరి 27 : కేసుల పరిష్కారంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోర్టు రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచిందని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్ చెప్పారు. 2024వ సంవత్సరంలో జాతీయ లోక్ అదాలత్‌ల నిర్వహణపై స్థానిక న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారిలతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ ఏడాది మార్చి 9, మే 11, సెప్టెంబరు 14, డిసెంబరు 14 తేదీల్లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామని చెప్పారు. లోక్ అదాలత్ ప్రారంభమయ్యే ముందుగానే రాజీ కాదగిన కక్షిదారులు తమ కేసుల వివరాలను తెలియజేయవచ్చునని, ఇరు పార్టీల వారితో ముందుగానే చర్చించి కౌన్సెలింగ్ ద్వారా జాతీయ లోక్ అదాలత్ తేదీనాటికి కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళసైతో యశోద ఆసుపత్రి చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథ రామారెడ్డి దంపతులు

కల్యాణ వేంకటేశ్వర స్వామికి పుష్పోత్సవం

ఉండి, జనవరి 27: శ్రీమదన మోహనస్వామి మందిరంలో రెండురోజులుగా శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామివారికి పుష్పోత్సవం, ఊంజలసేవ, ఏకాంతసేవ, చతుర్వేద పారాయణం, తీర్ద ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద చంద్రదాస్ బ్రహ్మచారి, గౌరీ హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు.

మావుళ్ళమ్మకు గజమాల



ఆకివీడు, జనవరి 27:భీమవరం మావుళ్ళమ్మకు భారీ గజమాలను శ్రీలక్ష్మీ గణపతి పండ్లు పూల వర్తక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పూల వ్యాపారి షేక్ బాబ్జీ 22 ఏళ్ళుగా పంపిస్తున్నారు. అదే విధంగా శుక్రవారం 120 కేజీల గజమాల ఆకివీడు నుంచి భీమవరం మావుళ్ళమ్మ దేవస్థానానికి పంపించి మాట్లాడారు. దేవతలు గ్రామాలకు ప్రతీకలన్నారు. ఆ దేవతల వలనే ఏళ్ళ తరబడి తన వ్యాపారం సజావుగా సాగుతుందన్నారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం, జనవరి 27: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయో గపడుతుందని పిప్పర వైద్యాధికారి కే.ప్రియాంక కోరారు. సీహెచ్ అగ్రహారంలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యనిపుణులు ఎస్.నిహారిక, ఎంపీటీసీ వెంకటనారాయణ, ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గణపవరం, జనవరి 27: గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని గణపవరం మండల పీఎంపీల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆదివారం సరిపల్లెలోని లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో భీమవరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

భావప్రచార పరిషత్ భక్త సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న స్వామీజీలు

కాళ్ళ, జనవరి 27 : రామకృష్ణ సేవా సమితి (కాళ్ళకూరు), వివేకానంద సేవా సమితి (పెద అమిరం) సంయుక్త ఆధ్వర్యంలో మధ్యాంధ్ర, రామకృష్ణ, వివేకానంద భావప్రచార పరిషత్ భక్తసమ్మేళనం ప్రాతాళ్ళమెరక గ్రామంలో నిర్వహించారు. 2వ రోజు నిర్వహించిన కార్యక్రమంలో స్వామి బోధమందయాజి (హైద్రాబాద్), స్వామి అనుపమానందజీ (కడప), స్వామి స్వసంవేద్యనందజీ, స్వామి వినిశ్చిలానందజీ, స్వామి సేస్యనందాజీ, స్వామి రఘునాయకనందజీలు భక్తులనుద్దేశించి ప్రసంగించారు. నామజపం సత్సంగంతో ఆగిపోకుండా సాహిత్యపరనం అవసరమన్నారు. కార్యక్రమంలో వేగిరాజు శివవర్మ, వేగేశ్న సోమరాజు, కేవీకే రాజు, ఉపాధ్యాయులు, భక్తజనులు పాల్గొన్నారు.

ఆలయంలో ఫ్లెక్సీల ఏర్పాటుపై భక్తుల విస్మయం



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పాలకొల్లు రూరల్, జనవరి 27: పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రారంభమైన ధర్మ ప్రచార మహోత్సవాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు, ఆర్భాటాలు భక్తుల విమర్శలకు దారి తీశాయి. ఆలయంలో దేవదాయ ధర్మాదా యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార మహోత్సవాల్లో ముఖ్యమంత్రి జగన్, మంత్రి ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని ఆలయం ప్రాంగణం లోపల ఏర్పాటు చేయటం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం లోపల ఎప్పుడూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయలేదని భక్తులు చెబుతున్నారు. ఆలయ ప్రాంగణం బయటే ఉండేవని ఇప్పుడు భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఫ్లెక్సీలు లోపల ఏర్పాటు చేయడం ఏమిటని భక్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

శేరేపాలెం సర్పంచ్‌కు సతీ వియోగం



మొగల్తూరు, జనవరి 27: శేరేపాలెం గ్రామ సర్పంచ్ తణుకుల మునేశ్వరరావుకు సతీ వియోగం కలిగింది. ఆయన సతీమణి రామ పద్మ కనకదుర్గ (54) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆమెకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్తకు ఎంతో చేదోడు వాదోడుగా ఉండే కనకదుర్గ మృతి చెందడంతో శేరేపాలెం గ్రామస్థులు విషాదానికి లోనయ్యారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

మొగల్తూరు, జనవరి 27: మొగల్తూరు పంచాయతీలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న తోరం శేషకుమారి (45) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. పడమటిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తూ చిన్నారులను తీర్చిదిద్దారు. గ్రామ సర్పంచ్ పడవల మేరీ, సీడీపీవో బి.ఊర్మిళ, అంగన్‌వాడీ టీచర్లు ఆమె భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి

భీమవరం, జనవరి 27 : జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చెయ్యాలని జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. ఈనెల 31 నుంచి వచ్చేనెల 5 వరకు జరిగే జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలపై ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, సంబంధిత అధికారులతో శనివారంనాడు జేసీ తన ఛాంబరులో సమీక్ష నిర్వహించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్ఫూర్తితో జిల్లా స్థాయిలో జరిగే పోటీలను విజయవంతం చేయాలన్నారు. క్రీడా ప్రాంతంలో తాగునీరు, మెడికల్ క్యాంపులు, ఫస్టు ఎయిడ్ బృందాలు, తగినన్ని క్రీడా సామగ్రి, తదితరు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

గన్నాబత్తుల పెదతాత విగ్రహం ఏర్పాటు చేస్తాం

భీమవరం జనవరి 27: డీఎన్‌ఆర్ కళాశాలలో స్థల దాత గన్నాబత్తుల పెదతాత నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి తాము సిద్ధంగా ఉన్నామని పెదతాత కుటుంబ సభ్యులు ప్రకటించారు. దీనిపై కుటుంబ సభ్యులందరూ త్వరలో నిర్ణయం తీసుకుని ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం నాడు ఆ కుటుంబానికి చెందిన గన్నాబత్తుల శ్రీనివాస్, ఆయన సోదరుడు డీఎన్‌ఆర్ పాలకవర్గ సభ్యుడు గన్నాబత్తుల కుమార్‌తో పాటు మరో దాత యర్రా సూర్యారావు కుటుంబానికి చెందిన యర్రా శేష తదితరులు విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం డీఎన్‌ఆర్ కళాశాలలో గతంలో ఏర్పాటు చేసిన గన్నాబత్తుల పెదతాత విగ్రహం ధ్వంసమై, చెత్తలో విసిరివేసిన సంఘటనపై అందరూ ఆవేదన చెందారని చెప్పారు. అయితే ఇది రాజకీయం చేయకూడదని మా కుటుంబం మౌనంగా ఉందన్నారు. ఈ సంఘటనపై డీఎన్‌ఆర్ పాలకవర్గం అధ్యక్షుడు నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు బాబు స్పందించి విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారని అన్నారు. అదేవిధంగా నరసాపురం పార్లమెంటు సభ్యుడు కనుమూరు రఘురాం కృష్ణంరాజు కూడా స్పందించి, పూర్తిగా ఖర్చు భరించి నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తానని తనకు చెప్పారని అన్నారు. ఈ విగ్రహం విషయంలో తమ కుటుంబమే ఏర్పాటు చేయాలా, ఎంపీ రఘురామ కృష్ణంరాజుకి, డీఎన్‌ఆర్ యాజమాన్యానికి అవకాశం ఇవ్వాలా అనేది త్వరలో నిర్ణయించి, పెదతాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అవినీతి ఉద్యోగిని పట్టుకున్న ఏఎంసీ చైర్మన్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 27: పెదతాడేపల్లి మేకల సంత వద్ద రైతుల నుంచి బిల్లు లేకుండా సుంకం వసూలు చేస్తున్న ఉద్యోగిని శనివారం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ పట్టుకున్నారు. తాడేపల్లిగూడెం ఏఎంసీ పరిధిలోని పెదతాడేపల్లి మేకల సంత వద్ద ఏఎంసీ ఉద్యోగులు బిల్లు రాసి ఒక్కో జీవానికి రూ.10 వసూలు చేస్తారు. అయితే కొందరు ఆ బిల్లులు రాయకుండా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ శనివారం తెల్లవారుజామున ఆకస్మికంగా వెళ్లి బిల్లు ఇవ్వకుండా సొమ్ములు వసూలు చేస్తున్న ఉద్యోగిని నిలదీసి దీనిపై కార్యదర్శి ప్రభాకర్‌కు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వైసీపీని అధికారంలోకి తెస్తేనే పథకాలు: కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 27: పథకాలు కొనసాగాలంటే తమ పార్టీనే అధికారంలోకి తేవాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గస్థాయి వైఎస్‌ఆర్ ఆసరా పథకంలో 3939 స్వయం సహాయక సంఘాలకు ఆయన శనివారం చెక్కులు అందించారు. ఆర్డీవో పి. చెన్నయ్య, ఎంపీడీవో విశ్వనాథ్, కమిషనర్ శామ్యూల్, జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.









విస్సాకోడేరులో ఎన్టీఆర్, పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మంతెన, బీసీ నాయకులు.. తణుకులో ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరిన పురోహితులు.. భీమవరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ-జనసేన నాయకులు.. పిప్పరలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు

'జగన్ రెడ్డిని తరిమికొట్టడానికి జనం సిద్ధం'

పెనుమంట్ర, జనవరి 27: అవినీతి, అరాచక పాలన సాగిస్తున్న జగన్ రెడ్డిని తరిమికొట్టడానికి జనం సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పెనుమంట్రలో శనివారం రెండవ రోజు ప్రజల వద్దకు పితాని కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత పితాని సత్యనారాయణ జనసేన సమన్వయకర్త చేగొండి సూర్య ప్రకాష్ కలసి పెనుమంట్ర కనకదుర్గ అమ్మవారిని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అవ్వ ఎలా ఉన్నావు..? అయ్యా సైకిల్ గుర్తుకు ఓటెయ్యండి అంటూ తనదైన శైలిలో పితాని సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలం టీడీపీ అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు కోయా కార్తీక్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు (వాసు) జనసేన మండల ఉపాధ్యక్షుడు బయ్యే బాలాజీ పాల్గొన్నారు.

పాలకోడేరు: బీసీలకు గుర్తింపు, గౌరవం ఇచ్చిన పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీయేనని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, బీసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరునాయుడు అన్నారు. విస్సాకోడేరులో జయహో బీసీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాలో 6 ఎమ్మెల్సీ పదవులు బీసీలకు ఇచ్చిన ఘనత తమ పార్టీదేనన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, రామ్ ప్రసాద్, జిల్లా నాయకుడు జుత్తిగ నాగరాజు, చేబోలు రామకృష్ణ, రవింద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

తణుకు: బూటకపు హామీలతో బ్రాహ్మణులను జగన్ మోసగించాడని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం వేల్పూరులో నియోజకవర్గంలోని పురోహితులు టీడీపీలో చేరగా ఆరిమిల్లి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగన్ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రారంభించిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశాడన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి సుధాకర్, పితాని మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం: అధికారం వైసీపీని పారద్రోలాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, భీమవరం నియోజకవర్గం ఇంచార్జి కొటికలపూడి గోవిందరావు (చినబాబు) ఆదేశాల మేరకు చెనమల్ల చంద్రశేఖర్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమం శనివారం నిర్వహించారు. భీమవరం 4వ వార్డులో ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు దిరిశల ఫణి, యాతం గణేష్, మాదాసు శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పార్టీ విధివిధానాలకు ఆకర్షితులై మహిళలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు

గణపవరం: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది. శాంతిభద్రతలు కరువయ్యాయి. నిత్యా వసరాల ధరలు నింగిని తాకాయి. ధరలు తగ్గాలంటే సీఎం జగన్‌ను గద్దె దించాల్సిందేనని మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. శనివారం పిప్పరలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, ఇందుకూరి మారిరాజు, ప్రసాదరాజు, బాబురావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పెనుగొండ, జనవరి 27: బాహుజీపురం ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభాశరణ్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ మామిడిశెట్టి సుధాకర్, రెడ్డియ్య, సన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ



ఆసరా చెక్కును అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం రూరల్, జనవరి 7: మహిళల జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం సీతారాంపురం హైస్కూల్‌లో నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంతకు ముందు రుస్తుంబాద, సీతారాంపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల్ని ప్రారంభించారు. ఆ తరువాత పట్టణంలోని కాటన్‌పార్కులో జరిగిన ఆసరా కార్యక్రమానికి విచ్చేసి చెక్కులందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోని, చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, ఎంపీడీవో రమణారావు, ఏపీఎం పద్మ, జేవీఆర్ పాల్గొన్నారు.

15లోపు ఈ-పంట నమోదు చేయాలి

నరసాపురం రూరల్, జనవరి 27: వచ్చే నెల 15లోపు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి ఆదేశించారు. శనివారం కే బేతపూడి, కొప్పర్రు, లిఖితపూడి ఆర్‌బీకే కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. 50శాతం నాట్లు పూర్తయిందన్నారు. అన్ని కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు సేవలందించాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులు 10,26,26 లేదా 14,35,14, 28,28 ఎరువుల్ని మొదటి కోటాగా ఒక కట్ట వేయాలన్నారు. రెండో, మూడోవ కోటాలో యూరియ, పొటాష్ ఎరువుల్ని వాడుకోవాలన్నారు. జింక్ సల్ఫేటును, కాంప్లెక్స్ ఎరువులతో పాటు వేయకూడదన్నారు. జింకును రెండు పర్యాయాలు పిచికారి చేసుకోవాలని సూచించారు.

వచ్చే నెల 16న గ్రామీణ బంద్

భీమవరం అర్బన్, జనవరి 27: ఆహార భద్రతకి నష్టం కలిగించే మోదీ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్యనాయకుల సమావేశం సీఐటీయు కార్యాలయంలో జరిగింది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి లేకుండా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కార్యదర్శులు ఎడ్ల చిట్టిబాబు, శేషపు ఆశ్రీయ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలు



నరసాపురంలో కొవ్వలికి జ్ఞాపికను అందిస్తున్న ఎలక్ట్రీషియన్ సంఘం నాయకులు

భీమవరం అర్బన్, జనవరి 27: ఎలక్ట్రీషియన్స్ డే పురస్కరించుకుని భీమవరం మండల ఎలక్ట్రికల్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబళ్ళ శ్రీనివాసరావు, కింతాడ కృష్ణమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎలక్ట్రీషియన్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జీవీ నరసింహారావు, కట్టా శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: ఎలక్ట్రీషియన్ సంఘ సమస్యల పరిష్కారానికి కొవ్వలి ట్రస్టు అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకులు కొవ్వలి నాయుడు అన్నారు. శనివారం ఎలక్ట్రీషియన్ డే పురస్కరించుకుని సంఘం గౌరవ అధ్యక్షుడు ఉంగరాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొవ్వలి విచ్చేసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రావి రమేష్‌బాబు, కడలి దొరబాబు, సుధాకర్, ప్రభాకర్, బాబ్జీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్త నాగేశ్వరరావు మృతి



భీమవరం అర్బన్, జనవరి 27: సీనియర్ కాంగ్రెసు పార్టీ నాయకులు, ఆధ్యాత్మికవేత్త, సంఘసేవకులు పర్రిపాటి నాగేశ్వరరావు(86) శనివారం అనారోగ్యంతో భీమవరంలో మృతి చెందారు. నాగేశ్వరరావు సంగీత నృత్య కళాశాలను స్థాపించి అనేక మందికి ఉచితంగా శిక్షణ ఇప్పించారు. భీమవరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గాను, తెలుగుదేశం పార్టీ పట్టణ కోశాధికారిగాను పనిచేశారు.

నేడు లోసరిలో ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం రూరల్, జనవరి 27: నార్త్ అమెరికా తెలుగు సొసైటీ(ఎన్ఏటీఎస్) సహకారంతో రాజమండ్రి గౌతమి ఐ-ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం లోసరి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎన్ఏటీఎస్ డైరెక్టర్ కలిదిండి ప్రేమస్వరూప్ తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి కళ్ళజోళ్ల, కంటి ఆపరేషన్‌లు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు.

మాధవరంలో జనసేన పల్లెపోరు



గ్రామంలో పర్యటిస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 27: ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్రాభివృద్ధికి జనసేన ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మాధవరంలో పల్లెపోరు నిర్వహించి మాట్లాడుతూ గ్రామాలను వైసీపీ నిర్వీర్యం చేసిందని, ఎక్కడా అభివృద్ధి లేదన్నారు. పవన్ కల్యాణ్‌కు అధికారం ఇస్తే మీ పిల్లల భవిష్యత్ బాగుంటుందని గ్రామస్థులనుద్దేశించి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు విష్ణుప్రియ, గ్రామ నాయకుడు బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్ షిప్‌కు ఇద్దరు ఎంపిక



హెచ్ఎం పోతురాజు, ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు

ఆకివీడు, జనవరి 27: జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట పోతురాజు అన్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన పి.ప్రవీణ్, ఎ.ప్రసన్నలను శనివారం ఆయన అభినందించారు. ఈ విద్యార్థులకు ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ళు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు.

చిరంజీవికి పద్మవిభూషణ్ తెలుగువారికే గౌరవం



విలేకరులతో మాట్లాడుతున్న ఈలి నాని

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 27: మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ దక్కడం తెలుగు వారికెంతో గౌరవమని మాజీ ఎమ్మెల్యే ఈలి నాని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని తన నివాసం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడుతూ చిరంజీవి కళారంగానికే పరిమితం కాకుండా సేవా కార్యక్రమా లు చేపట్టి ఎందరికో ప్రాణదాతగా నిలిచారన్నారు. ఆయనతో పాటు మన తెలుగు రాజకీయ ఉద్దండులు వెంకయ్య నాయుడికి పద్మవిభూషణ్ అవార్డు రావడం ఆ ఆనందాన్ని రెట్టింపు చేసిందన్నారు. ఇద్దరు పద్మ విభూషణులకు ఈలి నాని అభినందనలు తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మారిశెట్టి సుబ్బారావు, నాయకులు దాట్ల జగన్నాథరాజు, తాటికాయల వీరన్న, చిరంజీవి ఫ్యాన్స్ నాయకుడు మేనా నానాజీ పాల్గొన్నారు.

డప్పు కళాకారుడు మోహన్‌రావు మృతి



ఆకివీడు, జనవరి 27: డప్పు కళాకారుడు కుంచాడ మోహన్‌రావు (58) మృతి ప్రజానాట్యమండలి, సీపీఎంకు తీరనిలోటని పార్టీ జిల్లా సెక్రటరీయేట్ సభ్యులు జేఎన్వీ గోపాలన్ అన్నారు. మోహనరావు పార్థీవదేహానికి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'భూమి హక్కుల యాజమాన్య చట్టం లోపం'

వీరవాసరం, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం 2022-23 లోప భూయిష్టంగా ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగళ్ళ వెంకటరమణ అన్నారు. శనివారం వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో నూతన భూహక్కు చట్టంలోని లోపాలపై భీమవరం బార్ అసోషియేషన్ న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో ఈచట్టంపై భూ యజమానులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

గీత కార్మికుల సభలు జయప్రదం చేయాలి

తణుకు, జనవరి 27: తణుకులో ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే రాష్ట్ర కల్లుగీత కార్మిక మహాసభలను విజయవంతం చేయాలని శనివారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గీత కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సంఘ నాయకులు కామన మునిస్వామి, గుబ్బల వీరరాఘవులు, కడలి పాండు తదితరులు పాల్గొన్నారు.

వరాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

అత్తిలి, జనవరి 27 : ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

అత్తిలి, జనవరి 27 : బల్లిపాడు శ్రీ ఉమర్ అలీషా ఆశ్రమంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఆకివీడుకు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ దండు పద్మావతి సహకారంతో జరిగిన ఈ వైద్య శిబిరంలో 56 మందికి డాక్టర్ పద్మావతి ఉచితంగా హోమియో మందులను పంపిణీ చేశారు.

501వ రోజుకు అన్న క్యాంటీన్



అన్నం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

అత్తిలి, జనవరి 27: మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అత్తిలిలో అన్న క్యాంటీన్ ద్వారా అన్నదానం చేపట్టి శుక్రవారంతో 500 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆరిమిల్లి అన్న క్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. శనివారం 501వ రోజున అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ పోలిశెట్టి చంటి సహకారంతో అన్నదానం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు పోలిశెట్టి చంటి, దాసం బాబ్జి, అత్తిలి మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయండి

ఇరగవరం, జనవరి 27 : ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో భీమవరంలో కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ కోరారు. శనివారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. 117 జీవోను రద్దు చేయాలని, పీఆర్సీ కరువు భత్యం బకాయిలను చెల్లించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

నేడు పెదఅమిరంలో మన ఓటు.. మన భవిష్యత్

కాళ్ళ, జనవరి 27 : పెదఅమిరంలోని నిర్మలదేవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 3గంటలకు మన ఓటు మన భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన భవిష్యత్ బాగు కోసం రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై రాజకీయ విశ్లేషకులతో చర్చా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు.

మావుళ్ళమ్మకు కమిషనర్ పూజలు

భీమవరం టౌన్, జనవరి 27 : రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనా రాయణ శనివారం మావుళ్ళమ్మను దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు మాట్లాడుతూ మావుళ్ళ మ్మ అమ్మవారికి 13 కేజీల బంగారంతో వస్తువులు స్థానికంగా తయారు చేయించేందుకు అనుమతి ఇప్పించాల్సిందిగా కోరారు. ముందుగా గునుపూడిలోని సోమేశ్వర స్వామివారిని కూడా దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 27: జగన్నాథపురంలో ఉరుసు ఉత్సవం వేడుకగా సాగుతోంది. శనివారం ఉత్సవంలో భాగంగా గంధం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దర్గా పోషకులు అబ్బిన నాగమణి, రాజీవ్ చౌదరి, గుర్రంపై గంధం ఊరేగింపు గ్రామంలో అత్యంత సంప్రదాయకంగా నిర్వహించారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి

పోడూరు, జనవరి 27: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ కృషి చేస్తున్నదని డెయిరీ ఆచంట ఏరియా పర్యవేక్షణాధికారి కె.పరమేశ్వరరావు అన్నారు. పండితవిల్లూరులో శనివారం పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతుల కింద దాణా గిన్నెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం చెర్మన్ నెక్కంటి వీర్రాజు, పశువైద్య సహాయకులు పి.సత్యనారాయణ, గ్రూప్‌లీడర్ నెక్కంటి హైమావతి పాల్గొన్నారు.

చదరంగం క్రీడాకారుడు శ్రీఉద్భవ్‌కు అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న శ్రీఉద్భవ్

పాలకొల్లు టౌన్, జనవరి 27: భీమవరంలో జరిగిన 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాలకొల్లు ఆదిత్య జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న మద్దుల మానస్ శ్రీఉద్భవ్‌కి కలెక్టర్ ప్రశాంతి అవార్డును అందించారు. గత ఏడాది డిసెంబర్‌లో తమిళనాడులో జరిగిన జాతీయ చదరంగం పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఆంధ్రరాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించినందుకు గాను కలెక్టర్ ఈ అవార్డును అందజేశారు.

- పాలకొల్లు విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణకు గణతంత్ర దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఉత్తమ సేవా పురస్కార్ ప్రదానం చేశారు.

జంతువుల్ని కాపాడదామంటూ ర్యాలీ

భీమవరం టౌన్, జనవరి 27: విద్యార్థి దశ నుంచి జంతువులను ప్రేమించి ఆదరించడం అలవర్చుకోవాలని జిల్లా పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్ అన్నారు. పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో జంతువులను ప్రేమిద్దాం .. మానవత్వం చాటుకుందామంటూ ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సత్యనారయణ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఠాకూర్‌కు భారతరత్న పట్ల హర్షం



ఠాకూర్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

భీమవరం జనవరి 27: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం భీమవరం మెంటే వారి తోటలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో కర్పూరి ఠాకూర్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ వృత్తి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగటం, దేశంలోనే ప్రధమంగా కుల గణన చేపట్టి ఓబీసీ రిజర్వేషన్ల కోసం ఆనాడే గట్టిగా పోరాడిన మహానేత కర్పూరీ ఠాకూర్ అని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మలువలస రఘుబాబు, ఎం.శ్రీమన్నారాయణ, ఎం.సత్యనారాయణ, సీహెచ్ బంగారురావు, మలువలస రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

ఉండి, జనవరి 27 : డ్వాక్రా మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని న్యాయవాదులు జి.గాయత్రి, ఉమారాణి అన్నారు. శనివారం ఉండి డ్వాక్రా భవనంలో మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ పిల్లలు వారి తల్లిదండ్రులు అపరిచితుల పట్ల, వారు చూపే ఆశల పట్ల ప్రభావితులు కాకుండా అప్రమత్తంగా వుండాలన్నారు.

పీవీఎల్ జన్మదిన వేడుకలు

కాళ్ళ, జనవరి 27 : పెదఅమిరంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు, నాయకులు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ భద్రతా వారోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 27: ఆర్టీసీ భద్రతా వారోత్సవాల సందర్భంగా సంస్థ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ శనివారం తాడేపల్లిగూడెం డిపోను సందర్శించి డిపో ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. డిపో ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమ సమస్యలపై చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ఎట్ హోమ్

భీమవరం, జనవరి 27 : జిల్లాను అభివృద్ధిచేసి, ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను కోరారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టరు బంగ్లా ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎట్ హోమ్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరు పి.ప్రశాంతి ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఎస్పీ రవి ప్రకాశ్, జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఆర్డీఓలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాథుర్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. అధికారుల కు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఆటవిడుపుగా అధికారుల నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకున్నాయి.